# ఆకలి

"జూనియర్ ఆఫీసరు అమృతరావు అప్పుడే భోజనం ముగించి, రివాల్వింగ్ ఛెయిర్‌లో వెనక్కి వాలాడు. హాయిగా వుంది. రుచిగల భోజనం సుష్టుగా తినడం వల్ల అతనికి తృప్తిగా, మత్తుగా ఉంది. పైన ఫాను చల్లనిగాలి విసురుతూ జోల పాడుతున్నట్లుంది. అతని ప్రాణం సుఖంతో నిజ స్వప్నావస్థల మధ్య ఊగిసలాడుతోంది.

సరిగ్గా అప్పుడే నారాయణ లోపలికి అడుగుపెట్టాడు. చాలా దీనంగా, హీనంగా ఉన్నాడు నారాయణ మాసిన గడ్డం, నలిగిన బట్టలు, కళతప్పిన ముఖం, బరువైన బతుకు ఈడుస్తున్న భారమైన కదలిక, దరిద్రంవల్ల క్రుంగిన ఆత్మ విశ్వాసం–,

"నమస్కారమయ్యా," అతి నెమ్మదిగా, నమ్రతగా అన్నాడు నారాయణ.

అమృతరావు అరమోడ్పు కళ్ళతో నారాయణ వంక చూసి ఏమిటన్నట్లు కనుబొమ్మలు ఎగరేశాడు.

"నా సస్పెన్షన్ విషయం - అయ్యా! మీ కాళ్ళు మొక్కి చెప్తున్నాను. నాకా నేరంలో భాగమే లేదయ్యా - నాకసలేం తెలీదు. నన్ను అందులో ఇరికించారు. అన్యాయంగా నా మీదకి తోశారు. ఆరు నెలలైపోయింది. అర్ధజీతంతో ఇల్లు గడవక ఉపవాసాలు ఉంటున్నాం బాబూ! మీరు నమ్మినా, నమ్మకపోయినా ఇంట్లో పొయ్యి రాజేసి మూడు పూటలయింది. నామీద అయిదుగురు ఆధారపడి ఉన్నారయ్యా. అంతా పని చెయ్యలేని ముసలివాళ్ళూ, పాలు తాగే పసివాళ్ళూ, అయ్యా! ఆకలితో వాళ్ళు చచ్చిపోతారేమోనని భయపడుతూ, వేడుకుంటున్నానయ్యా."

'ఇంక చాలు! చాలు' అన్నట్లు చెయ్యి ఊపాడు అమృతరావు అతనికి విసుగ్గా ఉంది. ఏమిటీ గోల? హాయిగా భోజనం చేసి, సుఖంగా విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఏమిటీ వెధవ ఏడుపు అని లోలోపల విసుక్కున్నాడు. అతనికి మూడు రోజుల నుండి తిండిలేదంటే ఏమిటో అర్థంకాలేదు. బొజ్జ నిండుగా ఉంది. కళ్ళు మత్తుగా వాలిపోతున్నాయి.

"చూద్దాంలే" అని మాత్రం చెప్పి, నారాయణని పంపేసి, ఆ క్షణంలోనే నారాయణ గురించి మర్చిపోయాడు అమృతరావు.

❖ ❖ ❖

అమృతరావు కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. ఆకలితో అతను నకనకలాడిపోతున్నాడు. రెండూ నలభై అయింది. ఇంటి నుండి నిండుగా కారేజీ వచ్చి సిద్ధంగా ఉంది. కానీ రావల్సిన పెద్ద ఆఫీసరు ఇంకా రాలేదు. ఆయనతో కలిసి అమృతరావు భోజనం చెయ్యాల్సి ఉంది. అమృతరావు ఉదయం ఆరింటికి ఇంట్లోంచి బయటపడ్డాడు. తొమ్మిది గంటల సమయంలో ఆఫీసరుగారు బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్న సమయంలో అమృతరావు మాత్రం ఏలినవారి పనిమీద తిరుగుతుండడం వల్ల ఫలహారం కూడా చెయ్యలేకపోయాడు... కళ్ళు తిరిగిపోతున్నాయి. నీరసంగా కుర్చీలో జారగిలపడ్డాడు.

సరిగ్గా అప్పుడొచ్చాడు నారాయణ. నిజంగా దరిద్ర నారాయణుడిలా ఉన్నాడు. మొన్నటికంటే మరీ హీనంగా వున్నాడు.

"బాబూ! దండాలయ్యా" అన్నాడు వినయంగా.

అమృతరావు నీరసంగా కళ్ళెత్తి చూశాడు.

"నాకేసి ఒక్కసారి చూడండయ్యా. మీరు పిల్లాజెల్లాతో కలకాలం చల్లగా ఉండాలి బాబు. మూడు రోజుల నుండి పెద్ద పిల్లకి జ్వరం. వారం రోజుల నుండి నూకల జావ కాచటానికైనా గతి లేకుండా పోయిందయ్యా. నా కా కేసులో నిజంగా ఏం తెలీదయ్యా మీరొక్కసారి నలుగుర్నీ పిలిచి అడగండయ్యా. నన్ను అన్యాయంగా అందులో ఇరికించారయ్యా. ఆకలితో నా పిల్లలు అన్యాయంగా చచ్చిపోతా...."

"సర్లే! నారాయణా నువ్వెళ్ళు. ఇప్పుడే నీ కేసు చూస్తాను. రేపు నువ్వు పనిలో చేరు" అంటూ అక్కడే ఎప్పటినుంచో ఉన్న నారాయణ కేసు చూసి ఫైనలైజ్ చేశాడు-

ఆకలితో పిల్లలు అనగానే! ఆకలితో నకనకలాడుతున్న అమృతరావు కడుపులో 'ఆవురో'మంటూ అరిచింది. ఫైలు మీద అతని సంతకం అయినంతనే పై ఆఫీసరుగారొచ్చారన్న కబురు వచ్చింది.

హడావిడిగా ఆఫీసు ప్యూను టేబుల్ మీద అయ్యగార్ల భోజనానికి అన్ని ఏర్పాట్లూ చేస్తూ క్యారేజీ విప్పాడు.

అమృత తుల్యమైన వాసనలు ఒక్కసారి గుప్పుమన్నాయి. అమృతరావు ప్రాణాలు జివ్వుమన్నాయి.

ప్యూను అన్నీ సర్దే లోపల అమృతరావు, నారాయణ నాలుగు కాలాలపాటు ఆకలి లేకుండా బతికే ఏర్పాటు చేశాడు కాగితాల మీద.

గంటకో, అరగంటకో కడుపు నింపే క్యారేజీ ఎదురుగా ఉన్న తననే ఆకలంత దహించి వేసిందే, ఆ ఆశే లేని వారి నెంత క్రుంగదీస్తుందీ రాకాసి ఆకలి అనే విషయం అమృతరావు కాక్షణంలో అర్థమయింది.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక - 20.9.1988)